క్లుప్తంగా

ప్రశాంతంగా కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్ష



అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న అడిషనల్ ఎస్పీ విమలాకుమారి

పుత్తూరు రూరల్: పోలీస్ రిక్రూట్‌మెంట్ ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పుత్తూరు పట్టణంలోని 13 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, తిరుపతి అడిషనల్ ఎస్పీ విమలాకుమారి నేతృత్వంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పుత్తూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ రామరాజు పర్యవేక్షణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మొత్తం 6,444 అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 6026 మంది మాత్రమే హాజరైనట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటును పరిశీలిస్తున్న సర్పంచ్ మురళీయాదవ్, ఏఈ రవిచంద్రన్

పుత్తూరు రూరల్: మండలంలోని పొట్టిగుట్ల గ్రామంలో ఇటీవల పర్యాటక మంత్రి ఆర్కే రోజా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే ఏపీ ట్రాన్స్‌కో అధికారులను కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆ శాఖ అధికారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీయాదవ్, ఏఈ రవిచంద్రన్, ట్రాన్స్‌కో సిబ్బంది శేఖర్, వేణు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా మునస్వామి



కార్వేటినగరం : శ్రీరంగరాజపురం ఏఎంసీ చైర్మన్‌గా వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం పంచాయతీ ఎర్రగుంట గ్రామానికి చెందిన నెల్లేపల్లి మునస్వామి నియమితులయ్యారు. ఆదివారం ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా మంగళపురి గోపి, సభ్యులుగా ఆకుల గోపి, లక్ష్మమ్మ, ఎలిజబెత్, బి.గోవిందరెడ్డి, ఎస్.బుజ్జి, జె.నీలమ్మ, ఎస్.సుజాత, వి.రాజేశ్వరి, ఎ.మునిలక్ష్మి, కె.రాణి, వి.జయమాలిని, ఏ.సురేష్‌బాబు, డీజీ గఫూర్‌ను నియమిస్తున్నట్లు పేర్కొంది.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

శ్రీరంగరాజపురం : పంచాయతీ పరిధిలోని 50 బసివిరెడ్డిపల్లెలో పరిసరాల పరిశుభ్రతపై ఆదివారం అవగాహన కల్పించారు. సర్పంచ్ వరదమ్మ మాట్లాడుతూ పకడ్బందీ పారిశుద్ధ్యం నిర్వహించిన పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య చర్యలను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు వీధుల్లో బ్లీచింగ్ చల్లి, ఫాగింగ్ చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుచానూరు: శిల్పారామంలోని కళా వేదికపై ఆదివారం సాయంత్రం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. నెల్లూరు నృత్యానికేతన్ కళాకారులు ప్రణవి, సాన్వీ, హర్షిత, వినూత్న, మమత, దేవినాగశ్రీ, లావణ్య, శాంబవి, నిత్య, జయసుకృతి ప్రదర్శించిన శ్రీబాలాత్రిపుర సుందరి కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. వారిని శిల్పారామం అధికారి ఖాదర్‌వలి జ్ఞాపికలతో సత్కరించారు.

జగనన్నను మరోసారి సీఎంను చేద్దాం

- నేను సిద్ధం.. మీరు సిద్ధమా !
- గడప గడప కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా పిలుపు



లబ్ధిదారులకు సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: ప్రజారంజక పాలన అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని.. అందుకు తాను సిద్ధమని, మీరు సిద్ధమా అంటూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి ఆర్కే రోజా ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె పుత్తూరు రూరల్ మండలం గోపాలకృష్ణాపురం సచివాలయ పరిధిలోని ఆనంబట్టు, పైడిపల్లి, పైడిపల్లి హరిజనవాడ, తొరూరు గ్రామాల్లో గడప పడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆసరా మీ కుటుంబాన్ని ఆదుకుందా? అంటూ ఆరా తీశారు. అందరూ అన్నీ అందుతున్నాయని సమాధానం చెప్పారు.

మేమూ సిద్ధమే..!

ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తాను సిద్ధం.. మీరు సిద్ధమా అని ప్రశ్నించగా పలువురు మహిళలు తామూ సిద్ధం అంటూ ముక్తకంఠంతో సమాధానం ఇచ్చారు. ఇలా గ్రామాలకు గ్రామాలు ఒక్కతాటిపై నిలబడి అభివృద్ధిని, సంక్షేమాన్ని మరింత సాధించుకోవాలని సూచించారు. గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని అన్నారు. నేడు జగనన్న మూడున్నరేళ్లలోనే అద్భుతాలు చేశారని, ఇందుకు దేశ ప్రధాని ప్రశంసలే నిదర్శనమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి రాజకీయ పార్టీ విడుదల చేసే మ్యానిఫెస్టోలోని హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని, అయితే జగనన్న 98 శాతం హామీలను నెరవేర్చి సరికొత్త చరిత్ర సృష్టించారని వివరించారు. ఇలాంటి సీఎం మనకు రావడం రాష్ట్ర ప్రజలు చేసుకొన్న అదృష్టమని అభివర్ణించారు. స్థానికంగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, గ్రామ సర్పంచ్ వసంత, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, సదాశివకోన దేవస్థానం చైర్మన్ జయచంద్ర, సర్పంచ్‌లు గోవిందస్వామిరెడ్డి, మురళీయాదవ్, స్థానిక నాయకులు షణ్ముగంరెడ్డి, సంపత్, నాగరాజు, సుబ్రమణ్యం, సదాశివరెడ్డి, కిషోర్, పూల ఆనంద్, పురుషోత్తం, గుర్రప్ప, సురేష్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



స్వామివారికిపూజలు చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు : వేపంజేరిలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ఆదివారం వైభవంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్యకైంకర్య పూజలు చేశారు. అనంతరం మూలవర్లను పాలు, పెరుగు, తేనె, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం12 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీలక్ష్మీనారాయణస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. ఉభయదారులైన చిత్తూరుకు చెందిన మోహన్ దంపతులను కంకణం కట్టారు. వేద మంత్రోచ్ఛారణ నడుమ కనులపండువగా దేవదేవేరుల కల్యాణం జరిపించారు. ఆలయ వ్యవస్థాపకుడు కె.శ్రీధర్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. మేనేజర్ వెంకటేశులురెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వృద్ధాప్యంలో అండగా పెన్షనర్స్ సంఘం



విరాళం అందజేస్తున్న కేఎస్ ప్రసాద్

పుత్తూరు రూరల్: ఉద్యోగ విరమణ తర్వాత వచ్చే వృద్ధాప్యంలో పెన్షనర్స్ సంఘం చేదోడుగా నిలుస్తోందని సంఘ అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు అన్నారు. ఆదివారం సంఘ భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రముఖ ఆడిటర్ రామకృష్ణ ఆదాయపు పన్ను గురించి వివరించారు. రాచపాళెం గ్రామానికి చెందిన స్వయంకృషి జనహిత స్వచ్ఛంద సేవాసమితి ఆధ్వర్యంలో పెన్షనర్స్‌కు జీవన ప్రమాణ పత్రాలను అందజేశారు. విద్వాన్ గోవిందయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కేఎస్ ప్రసాద్ సంఘ భవనం అభివృద్ధికి రూ.50 వేలు, చెంగల్రాజు రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రవిశంకర్, యుగంధర్‌రాజు, గుణశేఖర్‌రెడ్డి, కృపావరమ్మ, కుప్పయ్య, రామలింగం, నారాయణరెడ్డి, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిని సత్కరిస్తున్న నేతలు

వెదురుకుప్పం : రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆదివారం పుత్తూరులోని క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎంను ఎస్‌ఆర్‌పురం ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన మునస్వామి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కామసాని పద్మనాభ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. నారాయణస్వామి మాట్లాడుతూ అన్నదాతలకు అండగా నిలబడాలని సూచించారు. అందరినీ కలుపుకుని పనిచేయాలన్నారు. ప్రజా సేవే పరమావధిగా విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం శ్రమించాలని స్పష్టం చేశారు. కార్యక్రమరంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వెదురుకుప్పం మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి ఉమాచంద్రారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

చిన్నారుల ఆరోగ్యానికి పెద్దపీట



వంటగదిని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లత తెలిపారు. ఆదివారం లక్ష్మీపురం అంగన్‌వాడీ కేంద్రంలో నూతనంగా నిర్మించిన వంటగదిని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడు పథకం కింద పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పుష్పాంజలి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రామిరెడ్డి, స్థానిక నేతలు చిన్నరెడ్డి, సర్వేశ్వర్, పురందర్ పాల్గొన్నారు.

నేడు వెంగళరాజుకుప్పంలో 'గడప గడపకు'



మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం : మండలంలోని వెంగళరాజు కుప్పం సచివాలయ పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఎస్.శ్యామల తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొనే కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ లిల్లీ, వైస్ సర్పంచ్ సుమన్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి రూ.1.50 లక్షల సాయం

తిరుపతి కల్చరల్: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ చెన్నై అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మెకానిక్ సునీల్ కుమారుడి(3)కి వైద్యం కోసం తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో ఆది వారం రూ.1.50 లక్షలు సాయం చేశారు. మెకానిక్ కుమారుడి వైద్యం కోసం ఇంటిని సైతం తాకట్టు పెట్టి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అవస్థలు పడుతున్న మెకానిక్ సునీల్‌కు అసోసియేషన్ చేయూత ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. టూవీలర్స్ రాష్ట్ర అసోసియేషన్ రూ.20 వేలు, నవ్యాంధ్ర అసోసియేషన్ రూ.10 వేలు ఇవ్వగా మెకానిక్‌లు తమ కష్టార్జితాన్ని కలిపి రూ.1.50 లక్షలు అందజేశారు. అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ భూస్థాపితం కావడం ఖాయం

- మంత్రి ఆర్‌కే రోజా
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి టీడీపీ నాయకులు



పార్టీలో చేరిన వారితో మంత్రి ఆర్‌కే రోజా

నగరి : 'రాష్ట్రానికి ఎంతోమంది ముఖ్యమంత్రులు అయ్యారు.. కానీ ఎవరూ చేయని అభివృద్ధి, సంక్షేమం జగనన్న మాత్రమే చేస్తున్నారు.. పార్టీలకు అతీతంగా అన్ని పథకాలు అందించి సరికొత్త సృష్టిస్తున్నారు.. అందుకే నేడు టీడీపీకి చెందిన వారు కూడా జగనన్నకు అండగా నిలవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు' అని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. మండలంలోని మేళపట్టు గ్రామానికి చెందిన టీడీపీ మద్దతు సర్పంచ్ దేవి, ఆమె అనుచరులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం నగరి పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన వారికి మంత్రి ఆర్‌కే రోజా పార్టీ కండువాలు కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ భూస్థాపితం కావడం ఖాయమన్నారు. మరో 30 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ వారు ఏం చేయలేరని ప్రజలకు అప్పుడే అర్థమైందన్నారు. నగరిలో తనకు పోటీగా నిలిచి ఓడిన వ్యక్తి ఇదేం ఖర్మ అంటూ ఊర్లలోకి వస్తున్నారని, ఓడించి పంపినా మళ్లీ రాజకీయ లబ్ధి కోసం వస్తున్న వ్యక్తిని చూసి జనం ఇదేం ఖర్మరా మాకు అంటున్నారని తెలిపారు. ఏ రోజైనా సొంత డబ్బుతో ఆయన ప్రజలకు ఏమైనా చేశారా అని మంత్రి సూటిగా ప్రశ్నించారు. కొత్తగా వచ్చిన వారు, ఇదివరకే పార్టీలో ఉన్నవారు ఎలాంటి భేషజాలకు పోకుండా కలిసి మెలిసి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆమె సూచించారు. పార్టీలో చేరిన సర్పంచ్ దేవి మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం పార్టీలు చూడకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. మంత్రి రోజా తన చారిటబుల్ ట్రస్టుద్వారా ఎంతో మందిని ఆదుకుంటున్నారని, అలాంటి వారికి అండగా ఉండాలని తనవంతు సహకారం అందించాలని వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు తెలిపారు. సర్పంచ్‌తో పాటు నాయకులు ప్రకాష్, గోవిందన్, మునిరత్నం, శంకర్, దేశన్, గోపి, దేశయ్య, సురేష్ వీరితోపాటు వందమంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్ని యప్ప, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పార్టీ నాయకులు సుదర్శనం నాయుడు, హేమాద్రి, శ్రీనివాసులు రెడ్డి, నాగరత్నం, ఎం.రామ్మూర్తి, జైలా, గోపి, వెంకటేశు, బాలాజీ, బాబు, అరుల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి రోజా

- పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కే రోజా

వడమాలపేట : గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడాశాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఆదివారం ఆమె వడమాల సచివాలయ పరిధిలోని వడమాల గ్రామంలో జీజీపీ ఫండ్స్ రూ.5 లక్షలు, ఎమ్మెల్యే గ్రాంట్ రూ.10 లక్షల అంచనా నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీరు, వీధిలైట్లు, డ్రైనేజీ ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నవరత్నాలు అందేవిధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. గడపకు-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల సమస్యలు గుర్తించి వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఝాన్సీ కుటుంబానికి పరామర్శ..

వడమాల గ్రామానికి చెందిన ఝాన్సీ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. విషయం తెలిసి మంత్రి రోజా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఝాన్సీ మృతి గురించి తెలుసుకుని వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ అంజమ్మ, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రేణుక, డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్ చౌదరి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, సర్పంచ్‌లు శ్రీవిద్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సురేష్‌రాజు, నాయకులు ఉమాపతి, మునిబాబు, కిరణ్, మునిశేఖర్, వెంకటేష్, వెంకటరెడ్డి, నందయ్య తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌ను నియమించాలని వినతి

తిరుపతి కల్చరల్: జిమ్నాస్టిక్స్ ఎన్ఐఎస్ కోచ్‌ను నియమించడంతో పాటు ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని తిరుపతి జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ నేతలు కోరారు. వారు ఆదివారం శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో మంత్రి ఆర్‌కే.రోజాకు వినతి పత్రం సమర్పించారు. అంతకుముందు శివజ్యోతి నగర్‌లోని ప్రైవేటు భవన్‌లో తిరుపతి జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో జిమ్నాస్టిక్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని, ఇదే స్థాయిలో పతకాలు సాధించేందుకు ప్రణాళిక రూపొందించాలని, కోచ్‌ను నియమించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్యాట్రన్ ఎలమంచిలి ప్రవీణ్, అధ్యక్షుడు వైఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ.శివప్రసాద్, కోశాధికారి జయశేఖర్, ఈశ్వర్ ప్రకాష్, సి.శ్రీరాములు, వీజీ.అరుణ్, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, సీఈవో మురళి తదిరులు పాల్గొన్నారు.

రాజీనామా వార్తలు అవాస్తవం

- ఎంపీటీసీ సభ్యుడు పొన్నుస్వామి



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు పొన్నుస్వామి

కార్వేటినగరం : ఎంపీటీసీ సభ్యుడిగా పదవికి రాజీనామా చేసినట్లు కొన్ని పత్రికలు, సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని అన్నారు ఎంపీటీసీ సభ్యుడు డి.పొన్నుస్వామి తెలిపారు. ఆదివారం పాదిరికుప్పంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఇబ్బంది పెట్టేందుకే కొందరు ఆయన సొంత గ్రామంలోనే ఎంపీటీసీ సభ్యుడు రాజీనామా చేశారని దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. పాదిరికుప్పం అభివృద్ధికి డిప్యూటీ సీఎం ఎంతో చేశారని, ఆయన కృషి వల్లే తాను కూడా ఇంజినీరింగ్ చదవగలిగానని, ఎంపీటీసీ సభ్యుడు కాగలిగానని వెల్లడించారు. తాను ఎప్పటికీ వైఎస్సార్ సీపీలోనే ఉంటానని, ఎవరైనా అసత్య ప్రచారానికి పాల్పడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ ఉన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



ఎంపీకి వినతి పత్రమిస్తున్న సీపీఐ, అగ్రిగోల్డ్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు

తిరుపతి కల్చరల్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం అగ్రి గోల్డ్ బాధితులతో కలిసి తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తామని వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్రలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మూడేళ్లు గడుస్తున్నా బాధితులు అధికారుల చుట్టూ తిరుగున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. కొంతమందికి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు చేయలేదని పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ అండ్ ఏజెన్సీ వెల్ఫేర్ అసోసియేషన జిల్లా అధ్యక్షుడు బెల్లం కొండ శ్రీనివాస్ మాట్లాడుతూ బాధతులు అగ్రిగోల్డ్ ఏజెంట్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నేత విశ్వనాథ్, జయచంద్ర, కోదండరామిరెడ్డి, ఈశ్వరయ్య, లక్ష్మీనారాయణ, గంగయ్య, నాగజ్యోతి, సుశీల, జమున తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు ఆరోగ్య భద్రతను పాటించాలి



ప్రెస్‌క్లబ్ మెడికల్ క్యాంపులో షుగర్ పరీక్షలు చేసుకుంటున్న ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి కల్చరల్: జర్నలిస్టులు ఆరోగ్య భద్రతను పాటించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు.తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం శ్రీసాయి హర్షిత చారిటబుల్ ట్రస్ట్, హర్షిత హాస్పిటల్ అధినేతలు డాక్టర్ కృష్ణప్రశాంతి, సీనియర్ కన్సల్టెంట్, టాప్రోస్కోపిక్, జనరల్ సర్జన్ డాకర్ హరినాథరెడ్డి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యే భూమన ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చాలామంది అవగాహన లేక ఊబకాయంతో అనేక రోగాలను కొని తెచ్చుకుంటున్నారని తెలిపారు. గతంలో మధుమేహంతో ఎంతోమంది చనిపోయారని తెలిపారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే జీవనశైలిలో మార్పు అనివార్యమన్నారు. డాక్టర్ కృష్ణప్రశాంతి జర్నలిస్టుల ఆరోగ్య సంక్షేమం కోసం మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ కరోనా తర్వాత ప్రజల జీవన విధానాల్లో చాలా మార్పులు వచ్చాయన్నారు. సమాజ హితం కోసం అహర్నిశలు పాటు పడే జర్నలిస్టులు వారి ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ప్రజలు ఆహారపు అలవాట్లలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డాక్టర్ కృష్ణప్రశాంతి మాట్లాడుతూ చాలా మంది ఆధునిక వైద్యంపై అవగాహన లేకుండా ఉన్నారని తెలిపారు. కోవిడ్ సమయంలో వైద్యురాలిగా తన మాట రోగిపై ఎంతో ప్రభావితం చూపిందని, వారు ఆరోగ్యవంతులవడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

ఉచితంగా వైద్య పరీక్షలు..

అనంతరం చేపట్టిన మెడికల్ క్యాంపులో సుమారు 180 మంది జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. షుగర్, బీపీ, ఈసీజీ, యూరిక్ యాసిడ్, హెచ్‌బీ ఏ-1సీ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఇన్సులిన్ పెన్స్ ఎలా వాడాలి, వాటి ఉపయోగాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. శ్రీసాయి హర్షిత చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సుమారు రూ.లక్షల విలువైన మందులను మెగా మెడికల్ క్యాంపు నిర్వహణకు సమకూర్చారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, బాలచంద్ర మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ సభ్యుల ఆరోగ్యం కోసం ప్రతి మూడు నెలలకొకసారి మెగా మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు కృష్ణప్రశాంతి, హరినాథరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టులు, గైనకాలజిస్ట్ సునీత పాల్గొన్నారు.